క్లుప్తంగా

ఘనంగా మడేలయ్య బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న ప్రజలు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో రజకుల ఆరాధ్యదైవం మడేలయ్య బోనాల పండుగను రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హమాలివాడ హనుమాన్ సాయి ఆలయం నుంచి మడేలయ్య ఆలయం వరకు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య శోభాయాత్రగా తరలివెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. సల్లంగా చూడాలని వేడుకున్నారు. నల్ల కోటమ్మ లక్ష్మయ్య ట్రస్ట్ చైర్మన్ నల్ల శంకర్ మడేలయ్యకు పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మేకల మార్కెట్ బహిరంగ వేలం

నస్పూర్: పట్టణ పరిధి తీగల్‌పహాడ్‌లోని మేకల మార్కెట్‌కు ఈ నెల 25న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సతీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 22నుంచి 24వరకు కమిషనర్ నస్పూర్ మున్సిపాలిటీ పేరున బ్యాంకులో రూ.50వేల డీడీ తీసి మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ–ఏలో కలపండి'



నిరసన తెలుపుతున్న ముదిరాజ్‌లు

బెల్లంపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ముదిరాజ్ కులాన్ని బీసీ–డీ గ్రూపు నుంచి బీసీ–ఏ గ్రూపుకు మార్చాలని ముదిరాజ్ మహాసభ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు నెల్లి రమేష్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. అనంతరం ఆర్ఐ ఆదిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శి సాదు శ్రీధర్, పోలు కొమురయ్య, రమేష్, మత్తమారి ఉమా మహేష్, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.


విధుల్లో చేరిన బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో



జాయినింగ్ రిపోర్టును డీఎంహెచ్‌వోకు అందిస్తున్న డాక్టర్ సుధాకర్‌నాయక్

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు ఆసిఫాబాద్ జిల్లా నుంచి బదిలీపై బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వోగా వచ్చిన డాక్టర్ సుధాకర్ నాయక్ శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత ఆధ్వర్యంలో విధుల్లో చేరారు. కార్యక్రమంలో డాక్టర్ ఫయాజ్ ఖాన్, సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

'చెస్ గేమ్‌తో సృజనాత్మకత పెంపొందుతుంది'



విద్యార్థులతో జెడ్పీ మాజీచైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

మందమర్రిరూరల్: చెస్ గేమ్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని బురదగూడెంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ చెస్ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చెస్ గేమ్‌లోని కాయిన్స్ మాదిరి మానవ చదరంగం వేషధారణతో ఆడిన గేమ్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ వజీర్ సుల్తాన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెస్ డెవలప్‌మెంట్ చైర్మన్ ఈగ కనుకయ్య, హైస్కూల్ చైర్మన్ రమా సిద్ధయ్య, తిరుపతిరెడ్డి, రవికిరణ్, కల్పన, కుమార్, రేణుక, ప్రవీణ్ ఉన్నారు.

వదలని వాన..!

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- కూలిన ఇళ్ల గోడలు
- విరిగిన విద్యుత్ స్తంభాలు



ఉప్పొంగిన కలమడుగు వాగు

జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శనివారం వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. పలు చోట్ల డ్రెయినేజీలు రోడ్లపై ప్రవహించగా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మరికొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి, ఇళ్ల గోడలు కూలిపోయాయి. లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో చెరువులను తలపించాయి.



నిండుగా ప్రవహిస్తున్న ప్రాణహిత నది

వేమనపల్లిలో..



వేమనపల్లి: నీల్వాయి ప్రాజెక్టు పూర్తిగా నిండటంతో మత్తడి గుండా వాగులోకి భారీగా వరద నీరు చేరుతోంది. చామనపల్లి పెద్దవాగు ఉప్పొంగడంతో నాలుగు గ్రామాలతో పాటు నెన్నెల మండలానికి రాకపోకలు స్తంభించాయి. నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి వరద నీరు దిశ మారి వేమనపల్లి, రాజారాం శివారులోని భారీగా పంట పొలాలను ముంచెత్తుతోంది. ప్రధాన రహదారి ఇరువైపులా పంట పొలాలు, వరినారుమడులు పూర్తిగా నీటమునిగాయి. ప్రాణహిత నది నిండుగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల్లోని సుమారు 200ఎకరాల్లో పంటలు నీటమునిగాయి.

జైపూర్‌లో...

జైపూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు చెరువులు, కుంటలకు భారీ వరద నీరు వచ్చి చేరింది. రసూల్‌పల్లి పెద్దవాగు, టేకుమట్ల వాగులు ఉధృతంగా ప్రవహించాయి. పంట పొలాలు, రోడ్లు జలమయంగా మారాయి. మండల వ్యాప్తంగా 45మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ఉప్పొంగిన వాగులు

చెన్నూర్‌రూరల్: వర్షాలకు మండలంలోని సుద్దాల, నారాయణపూర్, రాయిపేట, కత్తెరసాల, సంకారం, బుద్దారం గ్రామాలకు వెళ్లే రహదారుల్లోని వాగులు ఉప్పొంగాయి. అక్కెపల్లి గ్రామ సమీపంలోని వాగుపై ఉన్న కాజ్‌వే పై నుంచి వరద నీరు పారడంతో కొంత సమయం వరకు రాకపోకలు నిలిచిపోయాయి.

తెగిన చిన్నవాగు కల్వర్టు

భీమారం: భారీ వర్షాల కారణంగా మండలంలోని కాజిపల్లి గ్రామశివారులోని చిన్నవాగుపై గల కల్వర్టు శనివారం తెగిపోయింది. పంటపొలాలకు వెళ్లే రైతులు నానా అవస్థలు పడ్డారు. అధికారులు చర్యలు తీసుకొని మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

డ్రెయినేజీలోకి నీటి మళ్లింపు

చెన్నూర్: టీఎన్‌జీవో కాలనీ సమీపంలో వర్షపు నీరు నిలిచి రోడ్డు పైకి వచ్చాయి. వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించిన మున్సిపల్ కమిషనర్ గంగాధర్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని డ్రెయినేజీలకు మళ్లించారు.

రెస్క్యూ టీం ఏర్పాటు



చెన్నూర్: భారీ వర్షాలు కురుస్తుండడంతో మున్సిపాలిటీలో ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరించేందుకు చెన్నూర్ మున్సిపల్ రెస్క్యూ టీంను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఏ సమస్య వచ్చినా రెస్క్యూ బృందాన్ని ఆశ్రయించాలని కోరారు. అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు...

బరిగెల వెంకటేశ్, జూనియర్ అసిస్టెంట్
86602 91492
ఇప్ప రాజ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్
93473 02179

ఉప్పొంగిన ఎర్రవాగు

నెన్నెల: వర్షాలకు మండలంలోని నెన్నెల లంబాడితండా ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో లంబాడితండా, కుర్మగూడం, మన్నెగూడం, కోణంపేట, బోగంపల్లి, ఖర్జీ, జంగాల్‌పేట, దమ్మిరెడ్డిపేట ప్రజలకు రాకపోకలు నిలిచాయి. పంట పొలాలకు వెళ్లిన రైతులు పాఠశాలకు వెళ్లే విద్యార్థులు మండల కేంద్రానికి వచ్చే ప్రజలు మూడు గంటల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డెప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఆర్ఐ గణేష్ పోలీసులు ఎర్రవాగును సందర్శించి పరిశీలించారు. వాగు దాటకుండా ఎస్సై ప్రసాద్ పోలీసులను కాపలా ఉంచారు.

కూలిన ఇంటి గోడలు



ఎర్రగుంటపల్లిలో కూలిన నల్ల రమేష్ ఇంటి గోడ



పడ్తనపల్లిలో కూలిన దొండ రాజమ్మ ఇల్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని పలు గ్రామాల్లోని పాత ఇంటి మట్టి గోడలు వర్షానికి తడిసి ముద్దవుతున్నాయి. ఈ క్రమంలో పడ్తనపల్లి ఎస్సీ కాలనీలో దొండ రాజమ్మ ఇల్లు మట్టిగోడ తడిసి కూలిపోయింది. నిత్యావసర సరుకులు ఇంటి శిథిలాల కింద తడిసి చెడిపోయాయి. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ నిరుపేద కుటుంబం బతుకు బుగ్గిపాలు కాగా, ఇల్లు కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

చెన్నూర్‌రూరల్: ఎడతెరిపి లేని వర్షానికి మండలంలోని ఎర్రగుంటపల్లిలో నల్ల రమేష్, బొడ్డు గౌరక్క అనే వారికి చెందిన ఇంటి గోడలు కూలిపోయాయి. సమయానికి ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి హాని జరగలేదు. కూలీ పని చేసుకొని జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వం పట్టించుకొని నష్టపరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



స్టేట్‌బ్యాంక్ ఎదుట నిలిచిన వరదనీరు



విరిగిన 11 కేవీ విద్యుత్ స్తంభం

జన్నారం: మండలంలోని చెక్కపల్లి కుంట వద్ద శ్రీనివాస్ ఇంటి సమీపంలో వర్షానికి 11 కేవీ విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ స్తంభం విరిగిపడింది. దీంతో పాటుగా మరో మూడు స్తంభాలు విరిగాయి. స్తంభం విరిగిన సమయంలో విద్యుత్ సరఫరా ఉంది. ఆ సమయంలో అటువైపు ఎవరూ వెళ్లకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

జన్నారం: మండలంలో ఎడతెరిపి లేని వర్షానికి జనాలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. భారీ వర్షంతో వాగులు ఉప్పొంగాయి. రోడ్లపైకి వరద నీరు చేరింది. పొనకల్‌లో ప్రధాన రహదారిపై వరదనీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్టేట్‌బ్యాంకు ఎదుట, దుకాణ సముదాయాల ఎదుట వరదనీరు నిలిచింది. కవ్వాల్ రాంతాండా చుట్టూ వరద నీరు ప్రవహించింది.

పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి



ముత్యంపల్లి పాఠశాలలో...



తాండూర్: పాఠశాల పరిసరాలు పరిశీలిస్తూ...



జైపూర్‌లో...

జైపూర్: తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని జిల్లా మహిళా సాధికారత కేంద్ర కో ఆర్డినేటర్ సౌజన్య తెలిపారు. మండలంలోని మిట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు–తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. గుడ్‌టచ్–బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సౌజన్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలల్లో శనివారం ప్రభుత్వ సూచన మేరకు పేరెంట్స్, టీచర్ మీటింగ్ నిర్వహించారు. పాఠశాలల్లోని సమస్యలు, భవిష్యత్ ప్రణాళికలు పలు అంశాలపై చర్చించి అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవాపూర్ జిల్లా పరిషత్ హెచ్ఎం రమేష్‌రాథోడ్, కాసిపేట జిల్లా పరిషత్ హెచ్ఎం సాంబమూర్తి, ధర్మరావుపేట జిల్లా పరిషత్ హెచ్ఎం సుధాకర్ నాయక్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, ముత్యంపల్లిలో ఇన్‌చార్జి ఉపాధ్యాయురాలు పుష్ప, ఉపాధ్యాయులు బండ శాంకారి, కృష్ణగోపాల్, జ్యోతి , మాధవిలత, తిరుపతి, అమ్మ ఆదర్శ కమిటీల సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని తాండూర్ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపడుతామని ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో వాసాల ప్రభాకర్ తెలిపారు. పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై పలు వార్త పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించారు. అత్యవసరంగా పాఠశాలకు గేటు ఏర్పాటు చేసేందుకు ఎంపీడీవో, ఎంఈవోలు విరాళాలు అందజేశారు. దీంతో తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు స్పందించి వారు కూడా విరాళాలు అందజేశారు. రెండు రోజుల్లోగా గేటు ఏర్పాటు చేస్తామని, ప్రహరీ మరమ్మతులకు చర్యలు చేపడుతామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లలిత, పంచాయతీ కార్యదర్శి తపస్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కంపెనీ స్తంభాలకు వైర్లు కడితే చర్యలు

శ్రీరాంపూర్: సింగరేణి కరెంటు స్తంభాలకు ప్రైవేటు వ్యక్తులు వైర్లు కడితే చర్యలు తీసుకుంటామని శ్రీరాంపూర్ ఏరియా యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల కొందరు నెట్ కేబుల్లు, ఇతర నెట్‌వర్క్‌కు సంబంధించిన వైర్లను కంపెనీ కరెంటు స్తంభాలను కట్టుతున్నారని, దీంతో స్తంభాలు విరిగిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. కావున వెంటనే తొగించాలని లేనియెడల కంపెనీ చర్యలు తీసుకుంటుందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మందమర్రిరూరల్: ఏరియాలో సింగరేణి ఉద్యోగుల సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య తెలిపారు. ఏరియాలోని కేకే–5 గనిపై శనివారం ఉద్యోగులతో మాట్లాడి గనిలోని సమస్యలు తెలుసుకున్నారు. ఉద్యోగులకు మేలైన పనిముట్లు అందించాలని, గనిలో కావాల్సినంత గాలి సరఫరా అయ్యేలా చూడాలని, శ్రమదానం పేరిట ఉద్యోగులతో అదనపు పనులు చేయించరాదని తదితర సమస్యలు తన దృష్టికి రాగా గని మేనేజర్‌తో చర్చించి పరిష్కరించనున్నట్లు తెలిపారు.

బ్యాంకు రుణం ఇవ్వని ఇళ్ల పట్టాలెందుకు..?

బెల్లంపల్లి: పుర ప్రజలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు ప్రభుత్వ రంగ బ్యాంకులు అప్పు ఇవ్వడం లేదని బీజేపీ జిల్లా కార్యదర్శి కోయిల్‌కార్ గోవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో అట్టహాసంగా ఇళ్ల పట్టాలు ఇచ్చినప్పటికీ లబ్ధిదారులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోందని తెలిపారు. ఇంటి పట్టా ఇచ్చిన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ రంగ బ్యాంకులు రుణం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఈ సమస్యను పట్టించుకోవాలని కోరారు.

బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

కోటపల్లి: 317జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి న్యాయం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్ డిమాండ్ చేశారు. కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు.

దేవాపూర్‌లో శంభూపటేల్ వర్ధంతి

కాసిపేట: మండలంలోని దేవాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలోని కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సిడాం శంభూపటేల్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ సమాజం కోసం హక్కుల అమలుకు ఎన్నో పోరాటాలు చేసిన మహనీయుడని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపు, మండల అధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడ జంగు, మండల అధ్యక్షుడు ఆత్రం జంగు, ఓరియంట్ సిమెంట్ యూనియన్ నాయకులు భీంరావు, రెడ్డి లక్ష్మణ్ పాల్గొన్నారు.

సెల్‌లో సిగ్నల్ లేదు.. ఊళ్లల్లో కరెంట్ లేదు

వేమనపల్లి: వర్షానికి మండలంలో సమాచార వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. శుక్రవారం మల్లంపేట అటవీ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు కూలగా ట్రాన్స్‌కో సిబ్బంది సరిచేశారు. రెండు రోజుల్లో కేవలం రెండు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా ఉండగా శుక్ర, శనివారాల్లో విద్యుత్ సౌకర్యం లేక మండల వాసులు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రైవేట్ సంస్థలకు చెందిన సెల్‌ఫోన్ నెట్‌వర్క్ లేక ఫోన్‌లు మూగనోము పట్టాయి. ఎలాంటి సమాచారం లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సౌకర్యం లేక దోమలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రేమ్‌సాగర్‌రావు కృషి అభినందనీయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట: రైతాంగానికి సాగునీరు అందించడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు చేస్తున్న కృషి అభినందనీయమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, హాజీపూర్ మండల అధ్యక్షుడు రవి అన్నారు.

ప్రభుత్వ సలహాదారు కేకేను కలిసిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు (కేకే)ను శనివారం సచివాలయంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి గురించి కేశవరావుతో మాట్లాడి నిధులు మంజూరు చేయడానికి కృషి చేయాలని కోరారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న చిన్నయ్య



భీమారం: అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీడీవో

మంచిర్యాలటౌన్: చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని, వారికి సరైన పౌష్టికాహారంతో పాటు, ఆటపాటలతో కూడిన విద్య, సమయానికి చిన్నారులకు అందాల్సిన టీకాలు వేయడంతో పాటు, చిన్నారుల్లోని పౌష్టికాహార లోపాన్ని గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధను పెడతామని జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని అర్కలవాడ 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం అమ్మమాట–అంగన్‌వాడీ బాట ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రెండేళ్లు పూర్తి చేసుకున్న చిన్నారులకు అక్షరభ్యాసం చేయగా ఆరు నెలల చిన్నారులకు అన్నప్రాసన చేపట్టారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కిషన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, వార్డు కౌన్సిలర్ శ్రీరాముల సుజాత, ఎన్జీవో సభ్యులు అత్తి సరోజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, పోషన్ అభియాన్ డీపీఏ రజిత, ఆర్పీలు జ్యోతి, సునీత పాల్గొన్నారు. సంజీవయ్య కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో వార్డు కౌన్సిలర్ రామగిరి బానేష్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ అరుణ ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, చిన్నారులకు పలకలను అందించారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

భీమారం/తాండూర్/జైపూర్: అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా భీమారం, తాండూర్, జైపూర్ మండల కేంద్రాల్లో శనివారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై తల్లులకు అవగాహన కల్పించారు. వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. భీమారంలో ఎంపీడీవో రాధా రాథోడ్, ఐసీడీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ సంతోష్, సూపర్‌వైజర్ రజిత, తాండూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప రాణి, జైపూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి, అంగన్‌వాడీ టీచర్లు తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌లో కష్టపడే వారికి గుర్తింపు'

దండేపల్లి: పార్టీ కోసం కష్టపడే వారికి కాంగ్రెస్‌లో తప్పక గుర్తింపు ఉంటుందని, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. గిరిజన సహకార సంఘం రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన దండేపల్లి మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన కోట్నాక తిరుపతిని, దండేపల్లి పద్మశాలిభవన్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి సురేఖ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోట్నాక తిరుపతి కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు నమ్మకంగా పనిచేయడంతో పాటు, పార్టీ కోసం అహర్నిషలు కష్టపడ్డారన్నారు.ఆర్‌జీపీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, ఏఎంసీ చైర్మన్ ప్రేంచంద్, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్, కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

వేమనపల్లి: మండల కేంద్రంలోని వరద తాకిడికి ముంపునకు గురైన పత్తి చేళ్లను ఏఈవో రుక్సార్ సుల్తానా పరిశీలించారు. ముంపునకు గురైన పంటను సందర్శించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్లు ఆమె తెలిపారు.